


## కథ

**పి.వి.డి.ఎస్.ప్రకాష్**

# వారసుడు

'అక్షర కుటీర్'

ఆ అక్షరాలను చూడగానే శ్రీధరం మనసు పులకరించింది. ఎంతోకాలంగా కలలుకంటున్న తీరం చేరువైనట్లనిపించింది. నేర్చుకున్న ప్రణవాన్ని మళ్లీ మళ్లీ మననం చేసుకుంటున్నట్లుగా అవే అక్షరాలను పదే పదే చదువుతున్నాడు శ్రీధరం. అణచుకోలేని భక్తిప్రపత్తులతో పాలరాతి ఫలకంపై 'అక్షర కుటీర్'లోని ప్రతి అక్షరాన్నీ ఆత్మీయంగా తడిమి తడిమి చూసుకుంటున్నాడు. ఆ ఫలకం చుట్టూ పట్టిన దుమ్మును చేరుమాలుతో తుడుస్తూ.. 'దొరకునా ఇటువంటి సేవ..' అనుకున్నాడు తన్మయంగా. శ్రీధరానికి సాహిత్యమంటే మక్కువ ఎక్కువ. ఎం.ఏ. తెలుగులో స్వర్ణపతక విజేత.

'బాసరలో కొలువుంటే జ్ఞానసరస్వతి... ఇక్కడ, ఈ ఇంట్లో కొలువు తీరితే సాహితీమూర్తి వామనమూర్తి' అనుకున్నాడతను.

అలనాడు చిత్రకూటంపై నెలకొన్న అందమైన పర్ణశాలలాంటి ఇల్లు. ఆ ఇంటి చుట్టూ ప్రహరీ. మధ్యలో ఉన్న గేటులోంచి తొంగిచూస్తే ఇంటి ముందు ఖాళీస్థలంలో కమ్మని కావ్యం లాంటి పూలతోట. ఆ తోటలో వివిధ వర్ణాలతో విరబూసిన కవితల్లాంటి పూలు. వాటిని చూడగానే శ్రీధరం హృదయం ఆనందార్ణవమైంది.

''ఆధునిక తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన వామనమూర్తి అడుగులతో పవిత్రమైన నేల ఇది. ఇక్కడ్నుంచే అనర్ఘరత్నాలనబడే పుస్తకాలు పురుడుపోసుకున్నాయి. చరిత్రపుటల్లో శాశ్వతత్వాన్ని సముపార్జించుకున్నాయి'' తలచుకుంటున్నాడు శ్రీధరం.

నిజానికి, వామనమూర్తి చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. 'పుంభావ సరస్వతి'గా విఖ్యాతిగాంచారాయన. ప్రాచీన సాహిత్యం మొదలుకుని అర్వాచీన సాహిత్యం వరకూ ఆయన ఔపోసన పట్టారు. తెలుగువారికే సొంతమైన పద్యంలో ఎంతటి విశేష ప్రతిభ కనబరిచారో, గద్యంలోనూ అంతటి సృజనను ఆవిష్కరించారాయన. పౌరాణికాలను సరళంగా నవతరానికి అందించడమే కాకుండా, ఆధునిక సాహిత్యానికీ జయకేతనం ఎగురవేశారు. అంతటి మహానుభావుణ్ణి ఒక్కసారి కళ్లారా చూడాలని, మనసారా మాట్లాడాలని ఎంతగానో తపించిపోయాడు శ్రీధరం.

నెమ్మదిగా గేటు తీసేందుకు ప్రయత్నించాడతను.

లోన గడియకు తాళం పెట్టి ఉంది. అయితే, గేటు తలుపు చప్పుడికి కాబోలు..''ఎవరూ?'' ఓ గొంతు వినిపించింది. చూస్తే, తోటమాలిలా వున్నాడు. మొక్కలను నీళ్లతో తడుపుతున్నాడు. శ్రీధరాన్ని గమనించి చేస్తున్న పనిని వాయిదా వేసి..వచ్చి తాళం తీసి పలకరింపుగా నవ్వుతూ.. ''మీరు..'' ప్రశ్నార్థకంగా చూసారాయన.

''నేను...శ్రీధరాన్ని, అమరావతి గవర్నమెంట్ స్కూల్‌లో తెలుగుటీచర్‌గా పనిచేస్తున్నాను. వామనమూర్తిగారిని చూడాలని వచ్చాను'' అన్నాడు. ఆ వెంటనే ''వామనమూర్తిగారు రమ్మని పిలిచారు'' అంటూ జేబులోని ఓ లేఖని బయటకి తీసి చూపించాడు శ్రీధరం.

''రండి..'' ఆహ్వానించారు.

లాన్‌లో నడుస్తూ అడిగాడు శ్రీధరం..''ఈ సమయంలో నే రావడం ఇబ్బంది కలిగించదు కదా!''

''లేదు''న్నట్లు తల అడ్డంగా ఊపారాయన. ముందు గదిలోనికి వచ్చారిద్దరూ. కాసేపటి తర్వాత గ్లాసునిండుగా చల్లటి మంచినీళ్లతో ఇందాకటి వ్యక్తే వచ్చి ఎదురుగా కూర్చున్నాడు. ఇందాక తలపాగాతో కనిపించిన మనిషి ఇప్పుడు అది లేకుండా కనిపించేసరికి ఆయన్నే వామనమూర్తిగా గుర్తించి ఆశ్చర్యపోయాడు. వామనమూర్తి అందిస్తున్న మంచినీళ్ల గ్లాసు అందుకోనైనా అందుకోకుండా గభాల్న వంగి నమస్కారం చేసాడు శ్రీధరం.

శ్రీధరం అలా చేస్తాడని వామనమూర్తి ఊహించలేదు. వెన్వెంటనే తేరుకుని, అతడి భుజాలమీద చేతులుంచి పైకి లేవనెత్తి సోఫాలో కూర్చోబెట్టారాయన. తర్వాత శ్రీధరం గుక్కతిప్పుకోకుండా వామనమూర్తి సాహితీ సేవలను కీర్తించాడు. వామనమూర్తి ఇంతవరకూ వెలువరించిన పుస్తకాలు, వాటిపై పరిశీలకుల సమీక్షలు తదితరాలు ఉటంకిస్తూ ఆయన సాహిత్యంపై తనకున్న సాధికారికతను వ్యక్తీకరించాడు.

మాతృభాషపై మమకారం నానాటికీ సన్నగిల్లిపోతున్న ప్రస్తుతకాలంలో, ఒక యువకుడు సాహిత్యంపై మక్కువ పెంచుకోవడమే కాకుండా సాహితీ సృష్టిచేసిన తనలాంటి వారిని కలుసుకునేందుకు రావడం వామనమూర్తికి ఆనందం కలిగించింది. పరిచయమైన కొద్ది నిముషాల్లోనే ఇద్దరూ పాతమిత్రుల్లా కలిసిపోయారు. వయసుకి శ్రీధరం చిన్నవాడైనా సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువే. ''నా చిన్ని సాహితీ ప్రపంచం చూద్దురుగాని రండి'' అంటూ మేడమీది గదికి తీసుకెళ్లాడు శ్రీధరాన్ని. అది చిన్నగదైనా ఎంతో పొందికగా ఉంది. గదిలో ఓ మూల టేబుల్, మూడు కుర్చీలు, డబుల్‌కాట్ బెడ్‌తోపాటు సేద తీరేందుకు ఓ ఊయల కూడా ఉంది. అంతే కాదు...నాలుగువైపులా గోడలకు సాహితీమూర్తుల చిత్రపటాలు వేలాడుతున్నాయి. వామనమూర్తి కిటికీ తలుపులు తెరిచాడు. ఫ్రేం కట్టినట్లున్న ప్రకృతి కనిపిస్తోంది ఆహ్లాదంగా. గాలికెరటం ఒకటి ఒక్క ఉదుటున వచ్చి ఇద్దరిని పలకరించింది.


''ఇదే నా చిన్ని ప్రపంచం. ఎవరూ లేని ఏకాంతంలో ఇక్కడ పుస్తకాలే నేస్తాలు. అక్షరాలే ఆత్మీయులు. ఇక్కడ్నుంచే నా సాహితీసృజన కళ్లు తెరిచి లోకాన్ని చూసింది. ఎప్పుడైనా, ఏదైనా రాయాలనిపించినప్పుడు ఈ గదిలోకే వస్తాను'' చెబుతున్నారు వామనమూర్తి. రెండు బీరువాల నిండా లెక్కలేనన్ని పుస్తకాలు కొలువుతీరి వున్నాయి. శ్రీధరం కాస్త చనువుగా ఒక్కో పుస్తకాన్ని తీసి పరికించసాగాడు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఎందరెందరో కవులు, రచయితల పుస్తకాలున్నాయి. సమకాలీన మహాకవులు 'సాహితీ బంధువు వామనమూ

ర్తికి అభినందనలతో-' అంటూ స్వయంగా సంతకం చేసి బహూకరించిన పుస్తకాలను చూడగానే శ్రీధరం ఒళ్లు పులకించింది. అలనాటి అరుదైన సాహితీమూర్తుల చేతిరాతను చూసే భాగ్యం దక్కడం అదృష్టంగా భావించాడతను.

''ఇవన్నీ అరవయ్యో దశకంనుంచీ నే రాసిన నవలలు, కథలు, కవితలు, కావ్యాలు..'' అంటూ చూపించసాగాడు వామనమూర్తి.

ఓ చిన్నపిల్లాడు తాను భద్రంగా దాచుకున్న బొమ్మల్ని ఎంతో ఇష్టంగా తోటివారికి చూపిస్తున్నట్లు శ్రీధరానికి చూపిస్తున్నారాయన. శ్రీధరం కూడా తాను చూస్తున్న ప్రతి పుస్తకానికి సంబంధించిన సమాచారాన్ని అడిగి మరీ తెలుసుకుంటున్నాడు. ఒక్కో పేజీ తిరగేస్తూ..ఆ పేజీల్లోని అక్షరాలు, పదాలు, వాక్యాల వెంట చూపులు పరిగెత్తుతుంటే నవలోకాలెన్నో ఆహ్వానిస్తున్నట్లు ఆనందించసాగాడతను.

కొద్దిరోజుల్లోనే శ్రీధరానికి వామనమూర్తికి నడుమ విడదీయరాని సాహితీ బంధుత్వం



ఏర్పడింది. వీలుచిక్కినప్పుడల్లా కలుసుకుంటుండేవారు. అడపాదడపా ఉత్తరాల ద్వారా పలకరించుకుంటుండేవారు. ఆయా లేఖల్లో వామనమూర్తి అలనాటి సారస్వత విషయాలు ఆసక్తికరంగా వివరించేవారు. చదవాల్సిన పుస్తకాలను సూచించేవారు.

ఓ సాయంత్రం శ్రీధరం వామనమూర్తితో సంభాషిస్తుండగా-

''బాబూగారూ, లాయరుగారూ..మీ ఇద్దరు కొడుకులొచ్చారండీ'' అంటూ పనివాడు కబురందించాడు.

''వస్తున్నా...కూర్చోమను'' అన్నాడు. ఆ తర్వాత హఠాత్తుగా లేచి ''మీరు పుస్తకాలు చూస్తుండండి. ఇప్పుడే వస్తా'' అంటూ కిందికి వెళ్ళిపోయారు.

రెండేళ్లక్రితం వామనమూర్తి భార్య కాలం చేసిందని విన్నాడు శ్రీధరం. బహుశా, కుటుంబ వ్యవహారాలేవో చక్కబెట్టుకునేందుకు అతడి ఇద్దరు కొడుకులూ వచ్చారనుకున్నాడు. తిరిగి పుస్తకాలు చూడడంలో నిమగ్నమయ్యాడు శ్రీధరం. కింద మాటలు గట్టిగానే వినిపిస్తున్నాయి. ఆస్తిపాస్తులకు సంబంధించిన వివాదం కాబోలు.

వామనమూర్తి కూడా గట్టిగా అరుస్తున్నారు. వేళకానివేళలో వచ్చినట్లనిపించి శ్రీధరం కాస్త ఇబ్బందిపడ్డాడు.

అరగంట తర్వాత గదిలోకి వచ్చిన వామనమూర్తి చికాగ్గా ఉన్నారు. కొద్దిక్షణాలు ఏం మాట్లాడలేదాయన. నుదుటిని చేత్తో రుద్దుకుంటూ అలా కూర్చున్నారు. ఆయనని అలా చూస్తుంటే బాధనిపించింది శ్రీధరానికి.

'ఏం జరిగి ఉంటుంది? అయినా, వ్యక్తిగత విషయాలు తెలుసుకోవడం సభ్యతా, సబబు కాదు' అనుకున్నాడు శ్రీధరం.

అయితే అన్యమనస్కంగా ఉన్న వామనమూర్తికి కించిత్ ఊరట కలిగించాలనుందతనికి.

విషయం మార్చాలనే ఉద్దేశంతో అడిగాడు ''మీ సాహిత్యానికి అసలైన వారసులెవరనుకుంటున్నారు మీరు? మీ కుటుంబంలో ఎవరికైనా మీలా కలం పట్టి కావ్యాలు అల్లే అభిరుచి ఉందా?''

నిర్లిప్తంగా చూసారు శ్రీధరం వంక వామనమూర్తి. ఏం చెప్పాలో ఎలా చెప్పాలో అర్థం కాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు కాసేపు మౌనం దాల్చారు. గుండెల్లో బాధను అణచుకుంటూ గాఢ నిట్టూర్పు వదిలారు.

''సాహిత్యంపై అభిరుచిని మా నాన్నగారినుంచి అందిపుచ్చుకున్నాను. నా నుంచి ఈ ఇష్టాన్ని అందుకునేందుకు మా కుటుంబంలో ఎవరూ లేరు..'' అన్నారాయన దిగులుగా.

''తెలుగు చదవడం, మాట్లాడ్డం చిన్నతనంగా భావించేరోజులివి. తెలుగులో ఎంత ప్రావీణ్యం సంపాదించినా, సాహిత్యాన్నెంత సృష్టించినా కలిసివచ్చే కాలం కాదనే అభిప్రాయం చాలామందిలో ఉంది. తెలుగులో మంచి పట్టు సాధించినంత మాత్రాన ఒరిగేదేం ఉంది? ఈ రాష్ట్రం బయటకు వెడితే ఉపాధి అవకాశాలున్నాయా? అని ఆలోచించేవారిలో నా వారసులూ ఉన్నారు. నే తెలుగులో రాస్తుంటే వారికి చిన్నచూపు. నా సాహిత్యాన్ని మీబోటివాళ్లే ఆదరిస్తున్నారు తప్ప..ఇంట్లో ఏ ఒక్క సభ్యుడూ ఆదరించలేదు. గౌరవించలేదు. నా కడుపున పుట్టిన నా కొడుకులిద్దరికీ నా సాహిత్యం అబ్బలేదు. వారసత్వం



అందలేదు. ఈ గదిలోకి ఏ ఒక్కనాడు వారిద్దరూ వచ్చి ఒక్క క్షణం గడపలేదు. మీరూ మీలాంటి కొందరు మాత్రం వచ్చి ఈ సాహిత్యాన్ని, ఈ బీరువాల్లో భద్రపరిచిన మహామహుల పుస్తకాలను ఆసక్తిగా గమనిస్తుంటారు తప్ప, నా వాళ్లు వీటి వంక కన్నెత్తయినా చూడరు. వీలుచిక్కితే నాలుగు డబ్బుల కోసం పాత పుస్తకాల కొట్టుకి వీటిని తరలించేందుకు కూడా వెనుకాడరు. ఆ మాటా ఓసారి వ్యక్తపరిచారు కూడా..'' చెబుతున్నారు వామనమూర్తి.

''ఇప్పటిదాకా ఈ పుస్తకాలను నేనెంతో ప్రాణంగా దాచుకున్నాను. ఆందోళనగా, చికాగ్గా, ఉన్నప్పుడు ఆహ్లాదం కోసం నేనెప్పుడూ ఈ పుస్తకాలనే ఆశ్రయించాను. వీటితోనే సేదతీరాను. ఈ బీరువా దగ్గరికి వచ్చి నిలుచున్నప్పుడు చిరస్మణీయులైన మహామహులు నన్ను మనసారా పలకరిస్తున్నట్లనిపిస్తుంది. ఓ 'మేఘసందేశం', ఓ 'మాళవికాగ్నిమిత్రం' 'వసుచరిత్రం' పేజీలు తిరగేస్తుంటే కలిగే సాంత్వన వివరించేందుకు మాటలు చాలవు. 'విశ్వనాథ' 'శ్రీశ్రీ', 'దేవులపల్లి', 'బాలగంగాధరతిలక్' మొదలుకుని ఆధునిక సాహిత్యంలో తమదైన ముద్ర వేసుకున్న సాహితీమూర్తులంతా ఇక్కడే నా గదిలో, నా మదిలో కొలువుతీరి వున్నారు. ఇంతమంది సమక్షంలో నేనున్నాననే ఆత్మసంతృప్తిని మించిన ఆస్తి మరోటి లేదేమో?'' అంటున్నారాయన. కొద్దిక్షణాల మౌనం తర్వాత మళ్లీ ఆయనే అన్నారు. ''ఇందాక మా అబ్బాయిలిద్దరూ వచ్చారు. ఇద్దరూ స్టేట్ గవర్నమెంట్‌లో ఉన్నతస్థానంలో ఉన్న ఉద్యోగులే. ఆస్తిపంపకం కోసం వచ్చారిద్దరూ కలిసికట్టుగా, వారికి..ఇదిగోనే ఉంటున్న ఈ ఇంటితోపాటు కష్టపడి సంపాదించిన ఆస్తిలో వాటా కావాలట. అద్సరే! నే కష్టపడి ఆర్జించిన సాహిత్య గౌరవాన్ని వారసత్వాన్ని నిలుపుతామనడం లేదు. కలం పట్టుకుని కావ్య సృజన చేయనవసరం లేదు. విలువైన ఈ పుస్తకాలను వాళ్లు ఆస్తిగా పరిగణించడం లేదు. వీటిలో వాటా కోరుకోవడం లేదు. ఎంత త్వరగా వీటిని వదిలించుకోవాలా అని చూస్తున్నారంతే. అదే నా బాధ'' అంటున్నారాయన.

ఏం మాట్లాడాలో అర్థం కాలేదు శ్రీధరానికి.

నెల్లాళ్ళ తర్వాత ఓరోజు వామనమూర్తి నుంచి ఓ లేఖను శ్రీధరం అందుకున్నాడు.

''శ్రీధరం...ఇన్నాళ్లకు నా కల ఫలించేరోజు వచ్చిందనిపిస్తోంది. నా సారస్వతాన్ని ఇష్టపడే నా వారసుడు లభించాడనిపిస్తోంది. నా అక్షరాల ఆస్తిపాస్తులకు, నా పుస్తకాలకు అసలు సిసలైన వారసుడయ్యా అతడు. నా కుటుంబంలో ఎవరికీ లేని సారస్వతాభిలాషను పుణికిపుచ్చుకున్న బంగారు తండ్రి అతడు. బుల్లిబుల్లిగా పాకుతూ తన అభిరుచిని అప్పుడే ప్రకటించేసాడు. మా రెండో అబ్బాయి కొడుకు అన్నప్రాసన ఇటీవలే జరిగింది. ఆ సందర్భంగా వాడు నా పుస్తకాలను పట్టుకున్నాడు. ఎంతో సంతోషం వేసింది. నా ఇద్దరు కుమారుల్లా కాకుండా నా అక్షరాలకు, నా సాహిత్యానికి అసలు సిసలైన వారసుడిగా వాడు ఎదగాలని మనసారా కోరుకుంటున్నాను. అయితే, ఈ మనుషులు వాడిని స్వచ్ఛంగా, స్వేచ్ఛగా అభిరుచికి తగ్గట్టు ఎదగనిస్తారా? అనేదే నా సంశయం. ఏదేమైనా, పుట్టి పదినెలలైనా కాని ఆ భడవ...ఎన్ని వస్తువులు ముందు పెట్టినా నా పుస్తకాలనే తాకడం నాకెంతో ఆనందం కలిగిస్తోంది. ఈ తాతలా వాడు తెలుగునుడికారం పట్ల మమకారం పెంచుకోవాలనేదే నా తహతహ. ఆ కోరిక తీరుతుందంటావా?'' అంటూ ఆ ఉత్తరాన్ని ముగించారు వామనమూర్తి.

☆

## ప్చ్! సుస్మిత!!

**సుస్మితాసేన్‌కి 2008లో ఒక్క సినిమా కూడా లేదు. ఈ సంవత్సరం ఇప్పటి దాకా రిలీజైన రెండు సినిమాలు కర్మ, డునాట్ డిస్టర్బ్ కూడా బాక్సాఫీసు దగ్గర పల్టీ కొట్టాయి. దీంతో సుస్మిత కెరీర్‌లో నిరాశాజనకమైన వాతావరణం నెలకొందని వాపోతున్న వాళ్లకి సుష్ జవాబిచ్చింది. 'నా కెరీర్‌కేం కాలేదు. సినిమాలు తక్కువగా వున్నంత మాత్రాన నేను ఖాళీగా వున్నట్టా? సొంత కంపెనీల లావాదేవీలతో తలమునకలవుతున్నాను. రాబోయే నా సినిమాలు దుల్హా మిల్‌గయా, నో ప్రాబ్లెమ్ నాకు సక్సెస్ ఇస్తాయనే నమ్మకం నాకుంది' అంటోంది సుస్మిత.**